క్లుప్తంగా

డ్రగ్స్ వ్యతిరేక ప్రచారానికి చేయూత ఇవ్వండి



డాక్టర్ వాణికి కరపత్రాలు అందజేస్తున్న హ్యూమన్ రైట్స్ సెల్ జాతీయ చైర్మన్ రామకృష్ణ తదితరులు

మహారాణిపేట: డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో భాగంగా హ్యూమన్ రైట్స్ సెల్ జాతీయ చైర్మన్ కె.రామకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.ఎం.నాయుడు, మహిళా అధ్యక్షురాలు ఎం.రాధాకుమారి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం కేజీహెచ్‌లో మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణిని కలిసి డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో భాగంగా రూపొందించిన కరపత్రాలను ఆమెకు అందజేశారు. పలు కాలేజీల్లో త్వరలో నిర్వహించే సదస్సులకు చేయూత ఇవ్వాలని రామకృష్ణ కోరారు. అలాగే సైకాలజీ డాక్టర్లతో కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. పూర్తి సహకారం అందిస్తామని సూపరింటెండెంట్ హామీ ఇచ్చారు.

ఆధ్యాత్మికవేత్త రాజశేఖర్‌కు సత్కారం



ఎంవీ రాజశేఖర్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఈవో రాజగోపాల్‌రెడ్డి

దాబాగార్డెన్స్: టౌన్ కొత్తరోడ్డులో వేంచేసిన జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవంలో సేవలందించిన పలు సంస్థలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన పలువురికి మంగళవారం ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. సాంస్కృతిక కార్యకరమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ సేవలను గుర్తిస్తూ సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు పి.జగన్నాథాచార్యులు, సిబ్బంది ప్రసాద్, శ్రీరామ్, శ్రీహరి సేవకులు ఎన్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కేఎల్ రావుకు ఘన నివాళులు



డాక్టర్ కేఎల్ రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు, ఐఈఐ సభ్యులు

తాటిచెట్లపాలెం: ఇంజినీరింగ్ రంగంలో డాక్టర్ కేఎల్ రావు చేసిన సేవలు ఎనలేనివని ఐఈఐ నేషనల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఐ.సత్యనారాయణ కొనియాడారు. దొండపర్తిలోని ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్(ఇండియా)–విశాఖపట్నం లోకల్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన డాక్టర్ కేఎల్ రావు జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డాక్టర్ కేఎల్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఈఐ విశాఖపట్నం లోకల్ సెంటర్ చైర్మన్ డాక్టర్ కేవీ రామమోహన రావు, సెక్రటరీ ప్రొ.డాక్టర్ చల్లా సురేష్, ఐఈఐ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్డు



గొల్లలపాలెం రోడ్డు మధ్యలో ప్రమాదకర రీతిలో గొయ్యి

దాబాగార్డెన్స్: నియోజకవర్గం పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులు ప్రమాదకరంగా మారాయి. మెయిన్ రోడ్డు మధ్యలో పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. పక్షం రోజులుగా నగరంలోని 28వ వార్డు గొల్లలపాలెం బంగారమ్మ గుడి వద్ద మెయిన్ రోడ్డులో గుంత ఏర్పడింది. అటుగా నిత్యం అధికారులు వెళ్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ గొయ్యి కారణంగా ట్రాఫిక్ పెద్ద ఎత్తున నిలిచిపోతోంది. స్పందించే నాథుడు కరువవ్వడంతో వాహన చోదకులు అలాగే ప్రయాణిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నియోజకవర్గ పరిధి పలు ప్రాంతాల్లో ఏర్పడ్డ గుంతల మూసివేత చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు

పాతనగరం ఎటు పోతోంది?



పాతనగరం

- రెచ్చిపోతున్న కుర్రకారు
- గంజాయి మత్తులో యువకులు
- ఫూటుగా మద్యం సేవించి నడిరోడ్లపై విన్యాసాలు
- దాడులు.. హత్యలకు దారి తీస్తున్న వన్‌టౌన్ ప్రాంతం
- కరువైన పోలీసు నిఘా



ఇటీవల మద్యం మత్తులో జరిగిన తోపులాటలో తలకు తీవ్రగాయాలై మృతి చెందిన కొబ్బరితోటకు చెందిన గంట్యాడ కనకరాజు (ఫైల్)



రెండు రోజుల కిందట తగువులు వద్దు సర్దుకుపోండని అన్నందుకు కత్తిపోటుతో మృతి చెందిన ఎల్లాజీ (ఫైల్)



ఐదారు రోజుల కిందట మద్యం సేవించి అనుమానాస్పదంగా మృతి చెందిన వ్యక్తి (ఫైల్)

దాబాగార్డెన్స్: ఒకప్పటి టౌన్ ఏరియా పాతనగరం ఎటుపోతోంది? కుర్రకారు రెచ్చిపోతున్నారు. గంజాయి మత్తులో యువకులు తేలియాడుతున్నారు. మరోవైపు మందుబాబులు ఫూటుగా మద్యం సేవిస్తూ నడిరోడ్డుపై విన్యాసాలు చేస్తున్నారు. ఇంకో వైపు దాడులు.. ప్రతిదాడులు.. హత్యలు.. ఇలా ఎన్నో ఘటనలకు కేంద్రంగా నేడు పాతనగరం పేరు పడింది.

ఏకంగా మర్డర్లే..

ఏడాది కిందట సత్యనారాయణ స్వామి ఆలయ ఘాట్‌రోడ్డు (ఘాట్‌రోడ్డు ప్రారంభించక ముందు)లో ఓ గంజాయి బ్యాచ్ గంజాయి సేవిస్తుంటే.. నియంత్రించేందుకు వెళ్లిన పోలీసులపై తిరగబడ్డారు. ఓ పోలీస్ చెయ్యిని గంజాయి మత్తులో ఓ యువకుడు కొరికేసాడు. వారం రోజుల కిందట (పోలీసులు తెలిపిన వివరాల మేరకు) కొబ్బరితోటకు చెందిన గంట్యాడ కనకరాజు తన ద్విచక్ర వాహనం పెట్రోల్ లేక ఆగిపోయిందని, గీత్ సంగీత్ జంక్షన్లో ఓ టిఫిన్ బండి వద్ద టిఫిన్ చేస్తున్న పుక్కల శశికుమార్, నవీన్‌రాజ్‌లను పెట్రోలు అడిగాడు. వారు కుదరదని చెప్పినా.. వారి బండిలో పెట్రోల్ తీసేందుకు యత్నించాడు. ఈ క్రమంలో వారిద్దరూ కనకరాజుని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. తోపులాట జరిగింది. కనకరాజు మద్యం మత్తులో ఉండడంతో వెనక్కి తూలిపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

గొడవ వద్దన్నాడని స్నేహితుడినే పొడిచేశాడు..

గొడవలెందుకు సర్దుకు పోండి అన్నందుకు స్నేహితుడని కూడా చూడకుండా గంజాయి మత్తుల కత్తితో పొడిచి హతమర్చాడు. వేంకటేశ్వరమెట్టకు చెందిన చెట్టి ఎల్లాజీ (22), అయ్యప్ప ఇద్దరూ స్నేహితులు. వీరిద్దరూ 13వ తేదీ అర్ధరాత్రి వరకు మద్యం సేవించారు. అయ్యప్ప కెప్టెన్ రామారావు జంక్షన్ వైపు వెళ్లిపోగా.. ఎల్లాజీ డాబాగార్డెన్స్ వైపు వెళ్లాడు. ఇంతలోనే ఎల్లాజీకి స్నేహితుడు అయ్యప్ప ఫోన్ చేశాడు. కెప్టెన్ రామారావు జంక్షన్లో ఒకడితో గొడవ జరుగుతుంది రమ్మని పిలిచాడు. ఎల్లాజీ వెళ్లి వారిద్దర్నీ గొడవలెందుకు వెళ్లిపోండని నచ్చజెప్పి పంపించేశాడు. ఎల్లాజీ తిరిగి డాబాగార్డెన్స్ వైపు వెళ్లిపోతుండగా.. అయ్యప్ప వెనుక నుంచి మరో ఇద్దరి స్నేహితులతో కలిసి ప్రకాశరావుపేట సీఎంఆర్ వెనుక వైపున జాకీ షోరూం సమీపాన ఎల్లాజీ వీపుపై బలంగా కత్తితో పొడిచాడు. ఎల్లాజీ బండి వదిలి రక్తం కారుతూ వంద మీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లాడు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే ఈనెల 1వ తేదీన జ్ఞానాపురం శ్మశాన వాటికలో అల్లిపురం ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ నాగమణి ఎల్లాజీ (35) హత్యకు గురయ్యాడు.

మద్యానికి బానిసై..

మద్యానికి బానిసై మందుబాబులు నడిరోడ్డుపై విన్యాసాలు చేస్తున్నారు. ఫూటుగా మద్యం సేవించడం నడిరోడ్డుపై దొర్లడం. ఈ క్రమంలోనే ఓ మద్యం బాబు ఐదారు రోజుల కిందట పూర్ణామార్కెట్ దరి కల్లుపాకలకు సమీపాన ఫూటుగా మద్యం సేవించి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు.

విచ్చలవిడిగా మందు..

వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 6.. టూటౌన్.. మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారుగా 15 బార్ అండ్ రెస్టారెంట్లు నడుస్తున్నాయి. ఫిషింగ్ హార్బర్ రోడ్డులో 2, టౌన్ కొత్తరోడ్డు వద్ద 3, రామకృష్ణా జంక్షన్ వద్ద ఒకటి, పాతపోస్టాఫీస్ వద్ద ఒకటి, పండావీధిలో ఒక వైన్ షాప్ ఉన్నాయి. టూటౌన్.. మహారాణిపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో వెంకటేశ్వర థియేటర్, కేజీహెచ్ ఓపీ గేటు సమీపాన, డాలిఫిన్ హోటల్ జంక్షన్, లీలామహల్, చావులమదుం, అల్లిపురం.. ఇలా పలు ప్రాంతాల్లో మద్యం, బార్ దుకాణాలు నడుస్తున్నాయి. బార్ అండ్ రెస్టారెంట్‌కు గాని.. మద్యం దుకాణాలకు గాని సమయ పాలన ఉండడం లేదు. విచ్చలవిడిగా మందు దొరుకుతుంది. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో 24 గంటలు మద్యం లభిస్తోంది. చాలా వరకు నేరాలకు ఇది కూడా ఒక ముఖ్య కారణమని చెప్పొచ్చు.

రాత్రి 11 దాటితే..

రాత్రి 11 గంటలు దాటితే పాతనగరం ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. బయటికి వస్తే తిరిగి ఇంటికి వెళ్తామో లేదో తెలియదు. పోలీసులు నిఘా అంటున్నారు కానీ అదేమీ కానరావడం లేదు. మిస్సింగ్ కేసులు.. గంజాయి బ్యాచ్ అలజడులు.. ఇలా ఎన్నో సంఘటనలు జరుగుతున్నా స్పందించాల్సిన పోలీసుల్లో స్పందన అంతంత మాత్రమే. ముఖ్యంగా శని, ఆదివారాల్లో నగర ప్రజలతో పాటు పోలీస్ వ్యవస్థ కూడా నిద్రపోతోందా అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి 11 అయితే బైక్ రైడర్లు రెచ్చిపోతున్నారు. కనీసం నంబర్ ప్లేట్ కూడా లేకుండా బీచ్‌రోడ్డులో మందుబాబులు రెచ్చిపోతున్నారు. ఓ వైపు పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రజలు 24 గంటలు స్వేచ్ఛగా తిరిగేలా పోలీస్ వ్యవస్థ ప్రజలకు అండగా ఉంటుందని చెప్పిన దానికి.. పాతనగరంలో జరుగుతున్న దానికి పొంతనలేదు.

పోలీసుల స్పందన అంతంత మాత్రమే..

స్పందించాల్సిన పోలీసులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసులు గట్టిగా పట్టుకుంటే దారుణాలు జరిగి ఉండేవి కావంటున్నారు స్థానికులు. పోలీసుల వైఫల్యం కారణంగా తరచూ ఏదో చోట నేరం జరుగుతూనే ఉందని వాపోతున్నారు. ఇదిలా ఉండగా అగ్రహారం వీధి, కాదంబరివీధి, కంచరవీధి, రెల్లివీధి తదితర ప్రాంతాల్లో మందుబాబులు రెచ్చిపోతున్నారు.

ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం..



పాన్‌షాపులు.. ఇతర దుకాణాల్లో నిషేధిత మత్తు పదార్థాలు, సిగరెట్లు, గంజాయి, మద్యం, పాన్ పరాగ్, గుట్కా తదితరాలు విక్రయించకుండా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. అనుమానాస్పద దుకాణాలపై దాడులు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. రౌడీషీటర్లకు ఎప్పటికప్పుడు పోలీస్ స్టేషన్‌కు పిలిచి హెచ్చరిస్తున్నాం. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటున్నాం. రాత్రి వేళల్లో తగాదాలు జరగకుండా విస్తృతంగా పెట్రోలింగ్ చేస్తున్నాం.

– జీడీ బాబు,
స్టేషన్ హౌస్ ఆఫీసర్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్

ఆకాశవాణి సేవలు నిరుపమానం



మాట్లాడుతున్న డాక్టర్ బండి సత్యనారాయణ

దాబాగార్డెన్స్: అప్పటికీ.. ఇప్పటికీ ప్రజలకు చేరువగా సేవలందిస్తున్న సాధనం ఆకాశవాణి మాత్రమేనని, సాంకేతికంగా, సాంస్కృతికంగా ఆకాశవాణి (రేడియో) తన సేవలందిస్తూ కొనసాగుతోందని ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం విశ్రాంత వ్యాఖ్యాత, కవి డాక్టర్ బండి సత్యనారాయణ తెలిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గరిమ సాంస్కృతిక వేదిక పుష్కరోత్సవ కార్యక్రమంలో భాగంగా 4వ సాహిత్య సమావేశం నిర్వహించింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సిగ్నల్ అందని సముద్రం మధ్య భాగంలోనైనా మత్స్యకారులను ప్రమాదాల బారి నుంచి కాపాడగలిగేది, నాటి స్వాతంత్య్ర ఉద్యమంలో కానీ, నేటి రక్షణ రంగానికి సంబంధించిన సైన్యం పహారాలో గానీ కేవలం రేడియో మాత్రమే శత శాతం సేవలు కచ్చితంగా అందించగలిగే సాధనమని పేర్కొన్నారు. ప్రముఖ కళాకారులు, సినిమా నటులు ఆ రోజుల్లో ఎదగడానికి ఆకాశవాణి దోహదపడిందని బండి తెలిపారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఇక్కడి రీడర్స్ అభివృద్ధికి, పోటీ పరీక్షలకు చాలా మేలు చేస్తాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని రీడర్లను కోరారు. ప్రయోజనకరమైన విషయాలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తున్న జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ సిబ్బందిని, గరిమ సాంస్కృతిక వేదికను అభినందించారు. అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు మాట్లాడుతూ ఎఫ్‌ఎం రేడియోల ద్వారా ఆకాశవాణి అందిస్తున్న సేవలు వివరించారు. గరిమ సాంస్కృతిక వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కేవీఎస్ నరసింహం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పుష్కరోత్సవ సమన్వయకర్త సీహెచ్‌వీ సత్యనారాయణ, డీసీఎల్ డిప్యూటీ లైబ్రేరియన్ జి.తిరుమలకుమారి, రచయితలు డాక్టర కేవీఎస్ మూర్తి, బసు పోతన, గ్రంథాలయ పాఠకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ సమాజంలో సేవా కార్యక్రమాలు



అన్నదానం చేస్తున్న సంఘం నాయకులు

దాబాగార్డెన్స్: విశాఖ బీసీ సంక్షేమ సంఘం నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం దాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అభాగ్యులకు అన్నదానం చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ని శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర జేఏసీ కన్వీనర్ గొర్లె శ్రీనివాసనాయుడు, ఉత్తరాంధ్ర బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు, విశాఖ జిల్లా గౌరవ అధ్యక్షుడు కామన వెంకట సుబ్బారావు, పల్లా రమణ, సుభాస్ చంద్రబోస్, శివప్రసాద్, శేషగిరిరావు, హేమంత్, లోగిన గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పూల్ కలాసీల సమస్య పరిష్కారానికి హామీ

దాబాగార్డెన్స్: పోర్టు పూల్ కలాసీల సమస్య త్వరలో పరిష్కరిస్తానని కేంద్ర పోర్ట్స్, షిప్పింగ్ వాటర్ వేస్ కార్యదర్శి రామచంద్రన్ హామీ ఇచ్చారని పూల్ కలాసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.అప్పారావు, కార్యదర్శి చింతపల్లి పోతురాజు, ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు హేమంత్‌కుమార్ తెలిపారు. విశాఖ విచ్చేసిన ఆయనను కలిసి పూల్ కలాసీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని వినతిపత్రం అందజేశారు. గత 28 ఏళ్లుగా పోర్టులో వివిధ విభాగాల్లో పని చేస్తూ, చాలీ చాలని జీతంతో కొట్టుమిట్టాడుతున్నామని, టైం స్కేల్ వర్తింపజేయమని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నామని, సంబంధిత అధికారులు స్పందించాలని కోరినట్టు తెలిపారు. పూల్ కలాసీల పేరిట కంప్యూటర్ ఆపరేటర్, క్రేన్ ఆపరేటర్, పంప్ ఆపరేటర్, సెక్యూరిటీ గార్డ్, క్లర్క్, ఎలక్ట్రీషియన్లుగా పని చేస్తున్నప్పటికీ సమాన పనికి సమాన వేతం లేకుండా పూల్ కళాసీల జీవితాలు ముగిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది పూల్ కలాసీలను పర్మినెంట్ చేసి, మిగిలిన 530 మందిని పర్మినెంట్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని, ఫలితంగా చాలీ చాలని జీతాలతో అవస్థలు పడుతున్నామన్నారు. వాసుపల్లి రాము, కె.శ్రీనివాస్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాచపోలమాంబ పండగ



అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



రాచపోలమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అల్లిపురం: భక్తుల కొంగు బంగారం, 14 గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం రాచపోలమాంబ అమ్మవారి పండగ మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి తెల్లవారు జాము నుంచి విశేష పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. మెయిన్‌రోడ్డులో గల అమ్మవారి సతకం పట్టు వద్ద అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి పూజలు చేశారు. అమ్మవారి ప్రధాన దేవాలయం చెరువు గట్టు వద్ద వెలసిన ఆలయంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. సాయంత్రం అమ్మవారిని పెద్దింటి నుంచి డప్పు వాయిద్యాలు, మహిళల కోలాటం, పులివేషాలు, విచిత్ర వేషధారణతో కుమ్మరి వీధి, అల్లిపురం మెయిన్‌రోడ్డు, అమ్మవారి సతకం పట్టు, మార్కెట్ రోడ్డు, నేరెళ్లకోనేరు జంక్షన్ మీదుగా చెరువు గట్టులో గల అమ్మవారి ప్రధాన ఆలయం వరకు అమ్మవారి తిరువీధి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అమ్మవారిని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆయనను సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



అమ్మవారి సన్నిధిలో సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

గిరిజన విద్యార్థినులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న సభ్యులు

ఎంవీపీ కాలనీ: విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఎస్సీ, ఎస్టీ ఆఫీసర్స్, ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థినులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఎంవీపీ కాలనీ సెక్టార్ – 10లోని గిరిజన బాలికల హాస్టల్ ప్రాంగణంలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. 300 మంది విద్యార్థినులకు 2 వేల పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత అవకాశాలు, అభివృద్ధి సాధ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో ఆఫీసర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, కార్యదర్శి దేవీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రాష్ట్రాలు వ్యతిరేకించిన స్మార్ట్‌మీటర్లు మనకెందుకు?

సీపీఎం విశాఖ జిల్లా కమిటీ

దాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు, విద్యుత్ భారానికి వ్యతిరేకంగా సీపీఎం విశాఖ జిల్లా కమిటీ మంగళవారం సాయంత్రం నగరంలోని సింగ్ హోటల్ జంక్షన్ వద్ద దీపం బుడ్లు, లాంతర్లతో వినూత్న రీతిన నిరసన చేపట్టింది. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి పార్టీలు ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలను ఉల్లంఘించి, ఈ రోజు విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఇంటింటా బిగించడానికి సిద్ధపడ్డాయన్నారు. ఆ రోజు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మాట్లాడిన నారా లోకేష్ అధికారంలోకి వచ్చిన తర్వాత అవే స్మార్ట్ మీటర్లు బిగించేందుకు సిద్ధపడ్డారని, ఈ రోజు కేవలం అదానీ కంపెనీకి లాభం చేకూర్చడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారని దుయ్యబట్టారు. అదానీ రూపొందించిన స్మార్ట్ మీటర్ల వల్ల బిల్లులు భారీగా పెరుగుతున్నాయని, దీనిని అన్ని రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల్లో మీటర్లు మార్చమని, ఉన్న వాటిని కొనసాగిస్తామని తేల్చి చెప్పారని, కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వాటిని బిగించడానికి సిద్ధ పడుతుందన్నారు. స్మార్ట్ మీటర్ల ద్వారా ఒకే రోజులో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేర్వేరుగా చార్జీలు నిర్ణయించబడతాయని, ప్రజలపై కోట్లాది రూపాయల భారం పడే ఈ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని, పాత మీటర్లనే కొసాగించాలని, ప్రీపెయిడ్ మీటర్లతో కూడా దోచుకునే అవకాశం ఉండడంతో వాటిని కూడా ఉపసంహరించుకోవాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ ఏడాది విశాఖలోని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థకు రూ.1200 కోట్లు మిగులు ఉన్నా, యూనిట్‌కు రూ.40 పైసలు చొప్పున వసూలు చేసి, ప్రజలపై రూ.2700 కోట్ల భారం మోపారన్నారు. వీటికి వ్యతిరేకంగా సీపీఎం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలియజేస్తుందని, ప్రజలంతా స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలని కోరారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.గంగారావు, బి.పద్మ, కె.ఎం.శ్రీనివాస్, పి.మణి, బి.జగన్, వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.